సాక్షి కరీంనగర్

గురువారం । 5 । అక్టోబర్ । 2023



దర్యాప్తు జరిపించాలి

బీఆర్‌ఎస్ ప్రభుత్వ అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీ దర్యాప్తు జరిపించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. - IIలో▸



ఆభరణాల కోసమే మహిళ హత్య

బంగారు ఆభరణాల కోసమే మహిళను హత్యచేశారని పోలీసులు తెలిపారు. బుధవారం కరీంనగర్‌లో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ వెల్లడించారు. - IIలో▸

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడా స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నగేశ్ ముదిరాజ్

విద్యానగర్(కరీంనగర్): ముదిరాజ్‌లను బీసీ–ఏ జాబితాలో చేర్చి, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ మత్స్యకార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మంద నగేశ్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ కమిషన్ ద్వారా సరైన నివేదిక పంపించకపోవడం వల్ల రిజర్వేషన్ వర్తించక ముదిరాజ్ యువత విద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న హైదరాబాద్‌లో ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ నేతలు ఈటల రాజేందర్, కాసాని జ్ఞానేశ్వర్, బండ ప్రకాశ్ తదితరులు హాజరవుతారన్నారు. ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలు ఆవిష్కరించారు.

రైతులు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

- డీఎంవో పద్మావతి



మాట్లాడుతున్న డీఎంవో పద్మావతి

జమ్మికుంట(హుజూరాబాద్): సీసీఐ కొనుగోళ్లకు రైతులు తమ బ్యాంకు ఖాతాలకు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి(డీఎంవో) పద్మావతి అన్నారు. బుధవారం జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌లో మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి నాయక్ ఆధ్వర్యంలో అడ్తిదారులు, ఖరీదు వ్యాపారులు, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సీజన్ నవంబర్, డిసెంబర్‌లలో మార్కెట్‌లో కనీస మద్దతు ధర రూ.7,020 కన్నా తక్కువగా బహిరంగ మార్కెట్‌లో ప్రైవేటు కొనుగోళ్లు జరిగితే సీసీఐ కొనుగోళ్లకు దిగుతుందని తెలిపారు. రైతుల బ్యాంక్ అకౌంట్‌కు ఆన్‌లైన్ ద్వారా పత్తి విక్రయించిన డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. కౌలు రైతుల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, నిబంధనలు అమలు తీరును తెలియజేస్తామన్నారు. మార్కెట్ యార్డు ధరల విషయంలో ఎలాంటి తేడాలు, సమస్యలు రాకుండా సమష్టి అవగాహనతో కొనుగోళ్లు జరిగేలా అందరూ కలిసి పని చేయాలన్నారు. మార్కెట్ పరిధిలోని జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట ఏవోలు, ఏఈవోలు గ్రామ రైతు వేదికల్లో సమావేశాలు జరిగినప్పుడు రైతులకు ఆధార్ అనుసంధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. మార్కెట్ సెకండ్ గ్రేడ్ కార్యదర్శి రాజా, జమ్మికుంట ఏవో గోవర్దన్‌రెడ్డి, వీణవంక ఏవో గణేశ్, ఇల్లందకుంట ఏఈవోలు, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఆర్‌పై పునరాలోచించాలి

- పీఆర్సీ చైర్మన్‌కు టీఎన్జీవోల వినతి



పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌తో నాయకులు

కరీంనగర్ అర్బన్: ఐఆర్‌పై ప్రభుత్వం పునరాలోచించాలని, కేవలం 5 శాతమే ఇవ్వడం సమంజసం కాదని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌ల ఆధ్వర్యంలో పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను కలిసి, వినతి పత్రం అందించారు. ఐఆర్ 5 శాతంపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. దీనిపై సీఎం కేసీఆర్‌తో చర్చించి, నిర్ణయం తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను త్వరగా ఇవ్వాలన్నారు. కరీంనగర్ రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్ సింగ్ తదితరులున్నారు.

ఓటర్లు..31.12లక్షలు

ఉమ్మడి జిల్లాలో మహిళలే ఎక్కువ

- ఐదేళ్ల కింద 13 నియోజకవర్గాల్లో 27.88 లక్షల మందే
- కొత్త ఓటర్ల సంఖ్య 3,24,198
- కరీంనగర్‌లో అత్యధికం, రామగుండంలో అత్యల్పం
- పేర్ల నమోదుకు ఇంకా గడువు ఉంది





సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

త్వరలో జరగనున్న ఎన్నికలకు అధికార గణం సిద్ధమైంది. ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12,283 మంది ఓటర్లు ఉన్నారని అధికారులు వెల్లడించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఉండగా.. ఐదేళ్లకు 3,24,198 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. వీరిలో అధిక శాతం యువతే. ఓటరు నమోదుపై ఎన్నికల సంఘం చేసిన ప్రచార కార్యక్రమాలు, ప్రధాన మీడియా, సోషల్ మీడియా ద్వారా చేసిన ప్రచారం ఇందుకు దోహదపడిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. బీఎల్‌వోలకు ఇచ్చిన శిక్షణ, డబుల్ ఓట్ల ఏరివేత, మరణించినవారి ఓట్లు తొలగింపు, ఆరు కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లలో కుటుంబాల ప్రత్యక్ష తనిఖీలు, నకిలీ ఓటర్ల వడపోత తదితరాల ఫలితంగా ఈసారి వీలైనంత వరకు దోషాలు లేని జాబితాను రూపొందించినట్లు తెలిపారు.

ఈతరం మార్పు ఫలితం..

ప్రతీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. మొత్తం 13 నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా చూసినప్పుడు 3,41,913 మంది ఓటర్లతో కరీంనగర్ అగ్రస్థానంలో నిలవగా.. 2,14,974 ఓటర్లతో పెద్దపల్లి జిల్లా రామగుండం చివరి స్థానంలో నిలిచింది. కరీంనగర్ జిల్లాలో కొత్తగా 54,831 మంది నమోదయ్యారు. నగరంలో పెరిగిన సదుపాయాలు, వలసలు, విద్యాసంస్థలు, ఉమ్మడి జిల్లాలో రిటైరైన వారంతా ఇక్కడే స్థిరపడటం తదితరాలు ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు. మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ వేలాదిగా ఓట్లు పెరగడం నేటితరంలో ఓటు చైతన్యంపై వచ్చిన మార్పుగా మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

పెరుగుదల ఇలా..

కోరుట్లలో 20,652, జగిత్యాలలో 24,021, ధర్మపురిలో 17,890, రామగుండంలో 25,882, మంథనిలో 23,591, పెద్దపల్లిలో 27,413, కరీంనగర్‌లో 54,831, చొప్పదండిలో 16,957, వేములవాడలో 25,451, సిరిసిల్లలో 22,408, మానకొండూర్‌లో 15,909, హుజూరాబాద్‌లో 35,181, హుస్నాబాద్‌లో 14,005 మంది ఓటర్లు పెరిగారు.

సర్వీసు ఓటర్లు 1,594 మంది..

ఉమ్మడి జిల్లాలో నియోజవర్గాల వారీగా సర్వీసు ఓటర్లు.. కరీంనగర్‌లో 101, చొప్పదండిలో 192, మానకొండూరులో 128, హుజూరాబాద్‌లో 163, కోరుట్లలో 47, జగిత్యాలలో 43, ధర్మపురిలో 131, వేములవాడలో 52, సిరిసిల్లలో 106, రామగుండంలో 213, మంథనిలో 155, పెద్దపల్లిలో 263 మొత్తం1,594 మంది ఉన్నారు. వీరంతా సైన్యంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిసున్నారు.

దరఖాస్తు చేసుకోండి..

సెప్టెంబరు 19 వరకు కొత్త ఓటర్ల నమోదు, ఓటు బదిలీ, సవరణలకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఒకవేళ ఓటుపై అభ్యంతరాలు, ఇతర క్లెయిములు ఇంకా పరిష్కారానికి నోచుకోని వారి దరఖాస్తులు పరిష్కరిస్తారు. అలాగే, ఇంకా దరఖాస్తు చేసుకోని కొత్త పౌరులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. నామినేషన్‌కు ఆఖరు తేదీకి సరిగ్గా 10 రోజుల ముందు వరకు అవకాశం ఉంటుందని తెలిపింది. అన్ని రకాల దరఖాస్తులకు **voters.eci.gov.in** వెబ్‌సైట్‌లో లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ) లేదా బీఎల్వోను లేదా ఓటరు హెల్ప్‌లైన్ 1950లో సంప్రదించవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
కరీంనగర్	1,71,254	1,70,615	44	3,41,913
చొప్పదండి	1,11,197	1,18,141	08	2,29,346
మానకొండూరు	1,07,371	1,11,041	01	2,18,413
హుజూరాబాద్	1,19,676	1,24,833	05	2,44,514
జగిత్యాల	1,09,300	1,17,315	20	2,26,635
కోరుట్ల	1,13,030	1,23,692	04	2,36,726
ధర్మపురి	1,09,963	1,14,622	06	2,24,591
సిరిసిల్ల	1,17,872	1,22,920	06	2,40,798
వేములవాడ	1,04,943	1,13,186	31	2,18,160
పెద్దపల్లి	1,23,768	1,25,555	09	2,49,332
రామగుండం	1,08,233	1,06,716	25	2,14,974
మంథని	1,13,828	1,16,458	20	2,30,306
హుస్నాబాద్	1,17,165	1,19,406	04	2,36,575
మొత్తం	15,27,600	15,84,500	183	31,12,283

కులవృత్తుల పూర్వవైభవానికి చేయూత



మోడ్రన్ ధోబీఘాట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

- బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్: కులవృత్తుల పూర్వవైభవానికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఇందులో భాగంగానే రజకులకు ఆధునిక యాంత్రీకరణలతో కూడిన దోబీఘాట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. బుధవారం నగరంలోని 34, 35వ డివిజన్ల పరిధి గోదాంగడ్డలో నూతనంగా నిర్మించిన మోడ్రన్ దోబీఘాట్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ దోబీఘాట్‌లోని యంత్రాలకు గంటకు 24, రోజుకు 2,500 దుస్తులు శుభ్రం చేసే సామర్థ్యం ఉందన్నారు. ఇస్త్రీ కూడా చేసి, బయటకు పంపిస్తాయని పేర్కొన్నారు. నగరం నలుమూలలా దోబీఘాట్‌లు నిర్మిస్తామని, రాజీవ్ రహదారి సమీపంలో ఎకరం స్థలం కేటాయించామని తెలిపారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్లు షకీరా అంజుమ్ బర్కత్ అలీ, చాడగొండ బుచ్చిరెడ్డి, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

గతంలో నగరం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో చూసి వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి గంగుల కమలాకర్ విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లోని 20, 56, 34, 35, 36, 54, 55, 58, 59, 60, 30, 53 డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 20వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను, చౌకధరల దుకాణాన్ని ప్రారంభించారు. బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశారు. మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు తుల రాజేశ్వరి, వంగపల్లి రాజేందర్‌రావు, గందె మాధవి, పెద్దపల్లి జితేందర్, యాదయ్య పాల్గొన్నారు.

క్రీడారంగానికి పెద్దపీట

కరీంనగర్ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోంది మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం నగరంలో ఏర్పాటు చేసిన 29 క్రీడా ప్రాంగణాలకు సంబంధించి 29 క్రీడా కిట్లను యువజన సంఘాలకు పంపిణీ చేశారు. శారీరకంగా బలంగా ఉంటేనే మానసికంగా ఎదుగుదల సరిగా ఉంటుందన్నారు. మేయర్ సునీల్‌రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, క్రీడా శాఖ అధికారి రాజవీర్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పార్టీల చేతుల్లో అధికారం పెట్టొద్దు



జశ్వంత్‌కు కండువా కప్పుతున్న మంత్రి

కరీంనగర్: కాంగ్రెస్ కుమ్ములాటల పార్టీ, బీజేపీ మతతత్వ పార్టీ అని, ఢిల్లీ పార్టీల చేతుల్లో అధికారం పెడితే అంధకారమే తప్ప అభివృద్ధి శూన్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం 53వ డివిజన్‌లోని కశ్మీర్‌గడ్డ ఉమెన్స్ కళాశాల వద్ద మేయర్ వై.సునీల్‌రావు సమక్షంలో బీజేపీ నాయకుడు ఈసరి జశ్వంత్‌తోపాటు 200 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి, ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలతో 60 ఏళ్లలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కరీంనగర్‌కు కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి, అభివృద్ధి చేశామని, దాన్ని చూసి ఓట్లు వేయాలని ప్రజలను కోరారు. అంతకుముందు డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కార్పొరేటర్ శ్రీదేవి, అమ్జద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాళ్లకు సమస్యలు పట్టవా?



స్పోర్ట్స్ కిట్లు ఇస్తున్న విప్ కౌశిక్‌రెడ్డి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్: ఎంపీ బండి సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు ఈ ప్రాంత ప్రజల సమస్యలు పట్టవా అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గంలోని యువకులకు 138 స్పోర్ట్స్ కిట్లు, మహిళలకు బతుకమ్మ చీరలు, పట్టణ శివారులోని అహల్యనగర్ సమీపంలో వివిధ కుల సంఘాలకు భూ పట్టాలు, కరీంనగర్ రోడ్‌లోని కేసీఆర్ ఆటోనగర్ కార్మికులకు, వివిధ కుల సంఘాలకు భూ పట్టాలు పంపిణీ చేశారు. సిటీ సెంట్రల్ ఫంక్షన్‌హాల్‌లో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హుజూరాబాద్ పట్టణ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ కోట్లాది రూపాయలు కేటాయించారన్నారు. రూ.25 కోట్లతో ఇల్లందకుంట దేవాలయ అభివృద్ధి పనులు చేపట్టి మినీ యాదాద్రిగా మార్చేందుకు, హుజూరాబాద్‌లో మినీ కలెక్టరేట్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్ శ్యాం, ఎంపీపీలు ఇరుమల్ల రాణి, మమత, రేణుక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, డీపీవో వీరబుచ్చయ్య, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

నేడు నైట్‌ఫుడ్ బజార్ ప్రారంభం



విద్యానగర్‌లోని నైట్ ఫుడ్‌బజార్

కరీంనగర్ కార్పొరేషన్: ఎప్పుడెప్పుడా అని నగరవాసులు ఎదురుచూస్తున్న నైట్ ఫుడ్ బజార్ అందుబాటులోకి రానుంది. గురువారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ప్రారంభించనున్నారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా విద్యానగర్ శాతవాహన యూనివర్సిటీ వద్ద నగరపాలక సంస్థ ఈ బజార్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో నాలుగు వెజ్, నాలుగు నాన్‌వెజ్ స్టాల్స్ ఉంటాయి. వీటికి సంబంధించిన టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసి, కాంట్రాక్టర్లకు నెలకు రూ.5,100 నుంచి రూ.6 వేలకు అద్దె ప్రాతిపదికన గతంలోనే అప్పగించారు. సందర్శకులు కూర్చొని, ఆహార పదార్థాలు తినేందుకు సీటింగ్ ఏర్పాటు చేశారు. కేబుల్ బ్రిడ్జి తర్వాత నైట్‌ఫుడ్ బజార్ మరో పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది.

వాకింగ్ ట్రాక్ కూడా..

ఎల్‌ఎండీ కట్ట కింద ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు గురువారం ప్రారంభించనున్నారు. అలాగే, గిద్దెపెరుమాండ్ల స్వామి దేవాలయ మైదానంలో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌పై, ఎస్సారార్ మైదానంలోని వాకింగ్ ట్రాక్‌పై లైటింగ్‌ను ప్రారంభించనున్నారు.

‘వర్సిటీ’.. ఈ సమస్యలేమిటి?

- మెజారిటీ పోస్టులు ఖాళీ
- కాంట్రాక్టు, పార్ట్‌టైం లెక్చరర్లు.. సిబ్బంది కొరత
- రెగ్యులర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్‌గా మార్పు
- బడ్జెట్ లేక దక్కని ఫెలోషిప్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- శాతవాహన యూనివర్సిటీ దుస్థితి



శాతవాహన యూనివర్సిటీ

కరీంనగర్ సిటీ:

శాతవాహన యూనివర్సిటీ సమస్యలకు నిలయంగా మారింది. కాంట్రాక్ట్, పార్ట్‌టైం లెక్చరర్లు, సిబ్బంది కొరత వేధిస్తున్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటికితోడు తరగతులు సరిగా నిర్వహించకపోవడం, అనుకున్న స్థాయిలో విద్యాబోధన జరగడం లేదని, ఫలితంగా చదువులో వెనకబడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా నడుస్తున్న ఫుడ్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాలను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. అయినా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. 13 ఏళ్ల రెగ్యులర్ కోర్సులుగా ఉన్న తెలుగు, ఆంగ్లం, బోటనీ, మ్యాథమేటిక్స్ విభాగాలను యూజీసీ, 12బీ గుర్తింపు వచ్చిన తర్వాత సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చారు. దీంతో తాము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు వాపోతున్నారు. పోస్టుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, ఉన్నత విద్య ఎలా సాగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిసారీ మొండి చేయి చూపడంతో విద్యార్థులకు పరిశోధన ఫెలోషిప్ దక్కడం లేదు.

ఏ విభాగంలోనూ సగం మంది లేరు

శాతవాహన యూనివర్సిటీ ఏర్పాటు చేసినప్పటి నుంచి అధ్యాపకులు, సిబ్బందిని సరిపడా నియమించడం లేదు. వర్సిటీలో 114 మంది బోధనా సిబ్బంది ఉండాలి. కానీ, 63 మందితోనే నెట్టుకొస్తున్నారు. వీటిలో 16 పోస్టులు రెగ్యులర్ కాగా, మిగతావన్నీ కాంట్రాక్ట్, పార్ట్ టైం, రిటైర్డ్/గెస్ట్/అడ్జస్ట్ ఫ్యాకల్టీ. 10 మంది ప్రొఫెసర్ పోస్టులకు గానూ 8 ఖాళీగా ఉన్నాయి. ఇద్దరే రెగ్యులర్ ప్రొఫెసర్లు ఉన్నారు. 18 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు గానూ ఐదుగురు, 40 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గానూ 9 మంది మాత్రమే పని చేస్తున్నారు. 37 మంది కాంట్రాక్టు, 13 మంది పార్ట్ టైం అధ్యాపకులతో, ఆరుగురు రిటైర్డ్ గెస్ట్ ఫ్యాకల్టీలతో తరగతులు నిర్వహిస్తున్నారు. 51 మంది బోధనేతర సిబ్బంది అవసరం ఉండగా 13 మంది ఉన్నారు. మిగతా ఖాళీల్లో ఔట్ సోర్సింగ్, రోజువారీ సిబ్బందితో పని చేయిస్తున్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో నిబంధనల ప్రకారం ప్రతీ విభాగానికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. కానీ, ఏ ఒక్క విభాగానికీ వీటిలో సగం మంది లేరు. వర్సిటీలో అత్యంత కీలకమైన పరిపాలన విభాగంలో నాన్ టీచింగ్ పోస్టులు 75 శాతం ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ఉన్న సిబ్బందిపై అధిక భారం పడుతోంది. వారు రెగ్యులర్ సిబ్బంది కాకపోవడంతో జవాబుదారీతనంలో పని చేయడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ఇటు పరిపాలన, అటు విద్యాబోధనపై తీవ్ర ప్రభావం పడుతోందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. యూనివర్సిటీ సమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం పాలక మండలిని ఏర్పాటు చేసినా నామమాత్రంగా మారిందన్న ఆరోపణలున్నాయి. పాలకవర్గ సభ్యులు ఎక్కువగా ప్రైవేట్ కాలేజీలకు చెందినవారు కావడంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వర్సిటీలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. అరకొర సౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి, నిధులు మంజూరు చేసేలా వర్సిటీ అధికారులు కృషి చేయాలి.

– శ్రీకాంత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి



శాతవాహన యూనివర్సిటీలో సిబ్బంది కొరత ఉంది. ఔట్‌సోర్సింగ్ సిబ్బందితో పాలన అనుకున్న విధంగా సాగడం లేదు. వసతి గృహాల్లో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను వెంటనే ఎత్తివేసి, రెగ్యులర్‌గా మార్చాలి.

– ఎన్నం ప్రకాశ్, బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ఖాళీల భర్తీకి కృషి



ఎస్‌యూలో టీచింగ్, నాన్ టీచింగ్ విభాగాల్లో ఖాళీల భర్తీకి కృషి చేస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు కూడా పంపించాం. వచ్చే ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. సమస్యల పరిష్కారం దిశగా ముందుకెళ్తున్నాం.

– ప్రొఫెసర్ మల్లేశం, శాతవాహన వర్సిటీ వీసీ

క్లుప్తంగా

'అల్ఫోర్స్'లో ముందస్తు బతుకమ్మ, దసరా



బతుకమ్మలతో నరేందర్ రెడ్డి, విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్‌లో బుధవారం చిట్టి బతుకమ్మ ఉత్సవ్‌లో భాగంగా ముందస్తు బతుకమ్మ, దసరా వేడుకలు నిర్వహించారు. తొలుత దుర్గాదేవి విగ్రహానికి విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పూజ చేశారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి, ఉత్సాహంగా బతుకమ్మలు పేర్చారు. ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మల నిమజ్జనం తర్వాత వాయినం ఇచ్చుకొని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శమీ, వాహన, ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచుల అతి పెద్ద పండుగ బతుకమ్మ అన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

అల్ఫోర్స్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



కొత్తపల్లి: కరీంనగర్ సీతారాంపూర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే అట్టహాసంగా జరిగింది. స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో 'అల్ఫోర్స్ ఇగ్నైట్–2023' పేరిట నిర్వహించిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ప్రపుల్ దేశాయ్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిప్రజ్వలన చేశారు. జీవిత గమ్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల కరస్పాండెంట్ వి.రవీందర్ రెడ్డి, ఘనశ్యాం ఓజా, ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాళ్లు బి.విజయలక్ష్మి, జి.చంద్రశేఖర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

- జిల్లాలో ఆరుగురి ఎంపిక



కరీంనగర్‌రూరల్: హైదరాబాద్‌లో గురువారం నుంచి మహిళా ప్రజాప్రతినిధుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. వీటికి కరీంనగర్ జిల్లా నుంచి ఉన్నత విద్యావంతులైన ఆరుగురు మహిళా సర్పంచ్‌లను జిల్లా పంచాయతీ అధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు చిగురుమామిడి మండలంలోని రేకొండ సర్పంచ్ రజిత, చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ సర్పంచ్ సౌజన్య, కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్ సర్పంచ్ మడికంటి మమత, మానకొండూరు మండలంలోని అన్నారం సర్పంచ్ కవిత, సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ పద్మ, తిమ్మాపూర్ మండలంలోని మహాత్మానగర్ సర్పంచ్ శ్రీవాణిలు బుధవారం హైదరాబాద్ వెళ్లారు. ఈ నెల 7 వరకు జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించనున్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

- ఆభరణాల కోసమే మహిళను చంపినట్లు ఒప్పుకున్న నిందితులు
- అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం: బంగారు ఆభరణాల కోసం ఒక మహిళను హత్య చేసిన కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ (లాఅండ్‌ఆర్డర్) లక్ష్మీనారాయణ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా కమలాపూర్ మండలంలోని భీంపల్లికి చెందిన గుండారపు ప్రమీల(58) తన తండ్రి ఇజ్జగిరి కొమురయ్యకు రాత్రిళ్లు చెడు కలలు వస్తుండటంతో మొలంగూర్‌లోని ఓ బాబా వద్దకు తీసుకెళ్లాలనుకుంది. ఈ క్రమంలో ఈ నెల 1న వారు శంకరపట్నం మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద దిగి, ఆ బాబా చిరునామా వెతుక్కుంటూ వెళ్తున్నారు.

మద్యం తాగి కూర్చున్నారు..

కరీంనగర్ సిటిజన్ కాలనీకి చెందిన షేక్ గౌస్‌పాషా దుర్గమ్మగడ్డకు చెందిన అతని చెల్లి ఎండీ.నూర్జహాన్ బేగం, ఆమెతో సహజీవనం చేస్తున్న హుస్నేనిపురకు చెందిన మోహన్ మహిళల మెడలోని ఆభరణాలు చోరీ చేయాలని ప్రణాళిక వేసుకొని, అప్పటికే మొలంగూర్ క్రాస్ రోడ్డు వద్ద మద్యం తాగి కూర్చున్నారు. ప్రమీల, కొమురయ్యలు నడుచుకుంటూ వెళ్తుండగా ఆటో వారి వద్ద ఆపి, మొలంగూర్‌లో బాబా లేడని తాడికల్ శివాలయంలో తెలిసిన పూజారి కలలు రాకుండా చేస్తాడని నమ్మించి, ఆలయంలోకి తీసుకెళ్లారు. కత్తి చూపించి బెదిరించి, మహిళ మెడలోని పుస్తెలతాడు లాక్కుంటుండగా ఆమె ప్రతిఘటించింది. దీంతో వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై తండ్రి ఎదుటే విచక్షణారహితంగా దాడి చేయగా తీవ్రంగా గాయపడి, మృతిచెందింది. అనంతరం మృతురాలి మెడలోని పుస్తెలతాడు, చెవికమ్మలు తీసుకున్నారు. కత్తిని సమీపంలోని బండరాళ్లు ఉన్న ప్రాంతంలో పడేసి, వెళ్లిపోయారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్, శంకరపట్నం ఎస్సై లక్ష్మారెడ్డిలు పరిశీలించారు. అనంతరం సీపీ సుబ్బారాయుడు పర్యవేక్షణలో హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి, సీసీఎస్ ఏసీపీ మాధవి ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి, సీసీ ఫుటేజీల ఆధారంగా ఆటోను, నిందితుల కదలికలను గుర్తించారు. బుధవారం ఉదయం వారిని కరీంనగర్‌లోని దుర్గమ్మగడ్డలో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 26.5 గ్రాముల బంగారం, చెవికమ్మలు, ఆటో, కత్తి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీసులను సీపీ అభినందించి, రివార్డు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, సీసీఎస్ ఎస్సై మధుకర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సురేందర్‌పాల్, కానిస్టేబుళ్లు తిరుపతి, కనకరాజు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై ప్రధాని దర్యాప్తు జరిపించాలి

- సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గ్రామసభలో ఎంపిక చేయాలి
- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం చిగురుమామిడిలోని ముస్కురాజిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్‌ఎస్‌పై ప్రధాని మోదీ అవినీతి ఆరోపణలు చేసి దర్యాప్తు జరపకపోవడం ఏంటని ప్రశ్నించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా కర్ణాటక ఎన్నికలకు బీఆర్‌ఎస్ డబ్బులు పంపిందని ఆరోపించారని గుర్తుచేశారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డు సరే కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా అంశాలను ఎందుకు మరిచారని, విభజన హామీ చట్టాలను అమలు చేయలేదని గుర్తు చేశారు. మతోన్మాద బీజేపీని కేంద్రంలో ఓడించేందుకు లౌకిక ప్రజాస్వామ్యవాద శక్తులు ఏకంకావాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం లేకుండా సీఎం కేసీఆర్ చొరవ తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, మండల సహాయ కార్యదర్శి అందె చిన్నస్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, మహిళా విభాగం జిల్లా నాయకురాలు గూడెం లక్ష్మి, మండల నాయకురాలు రాకం అంజవ్వ, మండల మాజీ కార్యదర్శులు తేరాల సత్యనారాయణ, ఎనగందుల రాజయ్య, ముద్రకోల రాజయ్య పలువురు ఉన్నారు.

మాతృభాషలో పాఠశాల విద్య ఉత్తమం

- మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విద్యాసాగర్‌రావు

కరీంనగర్‌కల్చరల్: మాతృభాషకు ఆదరణ తగ్గడం అనర్థదాయకమని, కనీసం మాతృభాషలో పాఠశాల విద్యను అభ్యసిస్తే విద్యార్థుల మేధస్సుకు గట్టి పునాదులు ఏర్పడుతాయని మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కరీంనగర్‌కు చెందిన కవి డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి రచించిన మధుపాళీ వ్యాసతోరణ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. నేటి డిజిటల్ యుగంలో ఆంగ్లమాధ్యమ విద్యకు పిల్లలు, తల్లిదండ్రులు, పౌర సమాజం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో చిన్నారులు, రేపటి పౌరులు సంస్కృతి, వారసత్వాలకు దూరం అవుతూ, పాశ్చాత్య కల్చర్‌కు పట్టం కడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. చరిత్రలో మన తెలంగాణ ముద్దుబిడ్డలు అన్ని రంగాల్లో తమదైన ముద్రను వేయడం మనందరికీ గర్వకారణం అన్నారు. నేటి యువతను సన్మార్గంలో నడిపించడానికి ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, సాహితీవేత్తలు తమ పాత్రను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కవులు దాస్యం సేనాధిపతి, బైసా దేవదాసు, అనుముల దయాకర్, కఫిసో అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర తదితరులున్నారు.

బదిలీ ఆర్టీసీ డీఆర్‌ఎంకు సన్మానం



చందర్‌రావును సన్మానిస్తున్న ఆర్‌ఎం సుచరిత

కరీంనగర్: ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్)గా పనిచేస్తూ బస్ భవన్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్తున్న ఎస్.చందర్‌రావును రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు, అన్ని డిపోల మేనేజర్లు, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, రీజినల్ మేనేజర్ కార్యాలయ సిబ్బంది శాలువాలతో సత్కరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్) భూపతి రెడ్డి, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేశారు.

పదోన్నతిపై వెళ్తున్న అసిస్టెంట్ మేనేజర్‌కు..

కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)గా పనిచేస్తూ డిపో మేనేజర్‌గా మహబూబాబాద్ డిపోకు పదోన్నతిపై వెళ్తున్న శివప్రసాద్‌ను బుధవారం కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ సన్మానించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి యుగంధర్ రెడ్డి, కార్యాలయ సూపర్‌వైజర్లు గోపాల్ రెడ్డి, బి.సత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'ముదిరాజ్' మత్స్యకార విభాగం అధ్యక్షుడి నియామకం



నగేశ్ ముదిరాజ్

విద్యానగర్(కరీంనగర్): తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ మత్స్యకార విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన మంద నగేశ్ ముదిరాజ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్ నియమించారు. మత్స్య సహకార సంఘాలను ఐక్యం చేస్తూ గ్రామ, మండల, జిల్లా కమిటీలను నియమించి, విభాగం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

కట్నం కోసం వేధించిన భర్తపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన తిప్పర్తి రమ్యకృష్ణను అదనపు కట్నం కోసం వేధించినందుకు ఆమె భర్త పవన్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. స్థానిక అంబేద్కర్‌కాలనీకి చెందిన తిప్పర్తి రమ్యకృష్ణను ఐదేళ్ల క్రితం కృష్ణానగర్‌కు చెందిన పవన్‌కుమార్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఆ సమయంలో రూ.2 లక్షల కట్నం, తులం బంగారం అప్పగించారు. కొద్దికాలంగా అదనంగా మరో రూ.2 లక్షల కట్నం కావాలంటూ రమ్యకృష్ణను పవన్‌కుమార్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అర్చకుని ఇంట్లో చోరీకి యత్నం

సారంగాపూర్(జగిత్యాల): బీర్పూర్‌లోని శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకుడు వొద్దిపర్తి మధుకుమారాచార్యుల ఇంట్లో దొంగలు చోరీకి యత్నించారు. తుంగూర్ గ్రామానికి చెందిన మధుకుమార్ నృసింహస్వామి ఆలయంలో అర్చకుడు. తీర్థయాత్రల కోసం ఆయన కుటుంబసభ్యులతో కలిసి వారం క్రితం వెళ్లాడు. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా, ఇతర తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై గౌతంపవార్ ఆధ్వర్యంలో పోలీసులు చేరుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి గంగులను సన్మానించిన మైనారిటీ నాయకులు



మంత్రి కమలాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తపల్లిలో ముస్లింలకు 8 ఎకరాల స్థలం కేటాయించడం పట్ల బీఆర్‌ఎస్ మైనారిటీ సెల్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సయ్యద్ మాజిద్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ఆయన నివాసంలో కలిసి, సన్మానించారు. ఈద్గా కోసం స్థలం కేటాయించిన సీఎం కేసీఆర్‌కు, మంత్రి గంగులకు కృతజ్ఞతలు తెలిపారు. అంజాద్, యూసుఫ్, బాబుజానీ, ఫహాద్, నవాజ్, అఫ్జల్, జావీ ద్, హాజీ అస్మాత్, మనసుర్, మున్ను, మేరాజ్, గాఫర్, జమీల్, ఉస్మాన్, హనీఫ్, సోహెల్, ఆసిఫ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులతో కూడిన బదిలీలు చేపట్టాలి

- తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదర్శన్ రెడ్డి

హుజూరాబాద్: స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో బదిలీ పొందిన ఉపాధ్యాయులందరినీ రిలీవ్ చేయాలని, పదోన్నతులతో కూడిన బదిలీలు మాత్రమే చేపట్టాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలంపెల్లి ఆదర్శన్ రెడ్డి, గంప చంద్రశేఖర్‌లు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హుజూరాబాద్‌లో వారు మాట్లాడారు. ఎనిమిదేళ్లగా పదోన్నతులు లేక అనేక మంది ఉపాధ్యాయులు నష్టపోయారని, జీవో నంబర్ 5 ప్రకారం అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, భాషా పండితులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన తర్వాతే బదిలీలు చేపట్టాలన్నారు. వందలాది మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందడం వల్ల అనేక ఉన్నత పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో ఖాళీలు ఏర్పడ్డాయని, వాటిని అర్హత గల సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ద్వారా భర్తీ చేయాలని పేర్కొన్నారు. దీనివల్ల నష్టపోయిన టీచర్లకు లాభం జరుగుతుందని తెలిపారు.

ఫార్మసీ రంగానికి మంచి భవిష్యత్



మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

తిమ్మాపూర్(మానకొండూర్): ఫార్మసీ రంగానికి మంచి భవిష్యత్ ఉందని వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి ఆఫ్ ఫార్మసీ, వాగేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్‌లో బి.ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో చేరిన నూతన విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం ఓరియెంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆయన జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఫార్మసీ రంగానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, క్రమశిక్షణ, సమయపాలనతో కష్టపడుతూ ఉత్తమ ఫార్మసిస్టుగా పేరు పొందాలని సూచించారు. తక్కువ ధరకు మంచి మందులను తయారు చేసి, పేదలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు బి.వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

'యశోద'లో అరుదైన గుండె శస్త్రచికిత్స

- కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సత్యశ్రీధర్



మాట్లాడుతున్న డాక్టర్ సత్యశ్రీధర్

కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో అత్యంత అరుదైన గుండె శస్త్రచికిత్స చేసి, ఓ మహిళకు కొత్త జీవితాన్ని అందించినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సత్యశ్రీధర్ తెలిపారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్ పట్టణానికి చెందిన 54 ఏళ్ల చెన్నూరి లత గుండె దడ, నడిస్తే ఆయాసం, గట్టిగా ఊపిరి పీల్చుకోలేని పరిస్థితిలో ఏడాది క్రితం సోమాజిగూడలోని తమ ఆస్పత్రికి వచ్చిందన్నారు. ఆమెకు ఈసీజీ, 2డీ ఎకో, యాంజియోగ్రామ్ నిర్వహించగా పదే పదే గుండెపోటు వచ్చి, గుండె వ్యాకోచం చెందిందని గుర్తించినట్లు పేర్కొన్నారు. కార్డియాక్ రీమోడలింగ్ చికిత్స ద్వారా గుండె పరిమాణాన్ని తగ్గించామన్నారు. 6 గంటలపాటు సాగిన ఈ శస్త్రచికిత్సలో ఆమెకు బైపాస్ సర్జరీ, కార్డియాక్ అనాటమీ పునరుద్ధరణ, మిట్రల్ వాల్వ్ రిపేర్ తదితర ప్రక్రియలు జరిపినట్లు తెలిపారు. ఆమె పూర్తిగా కోలుకొని, ఏడాదిగా ఆరోగ్యంగా జీవిస్తోందన్నారు. గుండె వైఫల్యం అనేది అతికొద్ది మందిలో మాత్రమే వస్తుందని, అప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని పేర్కొన్నారు. అన్ని రకాల వైద్యులు, అధునాతన వైద్య సదుపాయాలు యశోద ఆస్పత్రిలో ఉండటం వల్లే ఇలాంటి ఆపరేషన్లు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. అనంతరం లత మాట్లాడుతూ.. తాను బతుకుతానని అనుకోలేదని, యశోద ఆస్పత్రి వైద్యులు అందించిన వైద్యంతో ఇప్పుడు సాధారణ జీవితాన్ని గడపడం సంతోషంగా ఉందన్నారు. డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఐఐటీ జామ్‌కు సన్నద్ధం కావాలి

- ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య బైరి



సదస్సులో ప్రొఫెసర్ బీరయ్య, అధ్యాపకులు

కరీంనగర్ సిటీ: విద్యార్థులు శాస్త్రీయ అవగాహనతో నిరంతరం సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని ఎస్సారార్ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత ఐఐటీ మద్రాస్ ప్రొఫెసర్ బీరయ్య బైరి అన్నారు. కరీంనగర్‌లోని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీలో రసాయన శాస్త్ర విభాగం, కళాశాల అలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐఐటీ జామ్, గేట్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఐఐటీ లాంటి జాతీయ స్థాయి సంస్థల్లో మాస్టర్స్ కోర్సు చేయడానికి నేటి నుంచే జామ్‌కు సన్నద్ధం కావాలని పేర్కొన్నారు. పరీక్షకు సంబంధించిన అర్హతలు, పరీక్షా విధానం, అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలను తెలియచేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ బీరయ్యలాగే అత్యున్నత స్థాయిని చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు కె.భాస్కర్, జి.శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి, సాయి మధుకర్, కళాశాల అలుమ్ని అసోసియేషన్ సెక్రటరీ, రాష్ట్ర టీజీసీజీటీఏ సెక్రటరీ సురేందర్ రెడ్డి, ట్రెజరర్ షుకుర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



భిక్షాటన చేస్తున్న ఆశవర్కర్లు

కరీంనగర్: ఆశవర్కర్ల సమ్మెకు కార్మిక, కర్షక లోకం అండగా ఉంటుందని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆశాల సమ్మె చట్టబద్ధమైనదన్నారు. పాలకులకు చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం మాట్లాడుతూ.. ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతామన్నారు.

ఆశవర్కర్ల భిక్షాటన

తమకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో భిక్షాటన చేశారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత మాట్లాడుతూ.. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు విజయలక్ష్మి, శంకరమ్మ, లలిత, సదాలక్ష్మి తదితరులున్నారు.

కేడీసీసీబీలో పలువురికి పదోన్నతులు



ఆర్డర్ కాపీ అందిస్తున్న చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ అర్బన్: కేడీసీసీబీలో పలువురిని పదోన్నతులు వరించాయి. రాత పరీక్ష, సీనియారిటీ, ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచినవారికి టెస్కాబ్ చైర్మన్, కేడీసీసీబీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు బుధవారం సంబంధిత ఆర్డర్ కాపీలను అందజేశారు. కె.ఉదయశ్రీ, ఎం.హరిప్రసాద్ మేనేజర్లుగా, కె.రవీనా, టి.రాకేశ్, ఎం.విజయ్‌కుమార్, బి.ఉమ, జి.రామకృష్ణ, బి.గోపినాథ్, రజనీకుమారి, ఎస్.ఉమ అసిస్టెంట్ మేనేజర్లుగా పదోన్నతి పొందారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో విధి నిర్వహణలో మరింతగా రాణించాలని సూచించారు. కేడీసీసీబీ సీఈవో ఎన్.సత్యనారాయణరావు, వైస్ చైర్మన్ పి.రమేశ్, డైరెక్టర్లు భూపతి సురేందర్, శ్రీగిరి శ్రీనివాస్, శ్రీపతి రవీందర్‌గౌడ్, జి.రాజిరెడ్డి, కిషన్‌రావు, నరేశ్ రెడ్డి, మోహన్‌రావు, ఎం.రమేశ్‌రెడ్డి, రాంచందర్ రావు, మోహన్‌రెడ్డి, స్వామిరెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, కమలాకర్, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలం కాంగ్రెస్ పార్టీదే

- మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రిస్టఫర్ తిలక్



మాట్లాడుతున్న క్రిస్టఫర్ తిలక్

తిమ్మాపూర్(మానకొండూర్): దేశంలో, రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలపై ప్రజలు విసిగిపోయారని రాబోయే కాలం కాంగ్రెస్ పార్టీదేనని మానకొండూర్ నియోజవర్గ ఇన్‌చార్జి క్రిస్టఫర్ తిలక్ అన్నారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు కవంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదని ఆరోపించారు. మానకొండూరు నియోజకవర్గంలో ఒకసారి సత్యనారాయణకు అవకాశమివ్వాలని కోరారు. బడుగు బలహీన వర్గాలకు, దళితులకు, నిరుద్యోగులకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఎస్ఎల్.గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

8న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్: యోగా అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న జిల్లాస్థాయి యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలను స్థానిక అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్ సింగ్, నాగిరెడ్డి సిద్ధారెడ్డి తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్స్ విభాగాల్లో బాలబాలికలకు, సీనియర్స్ విభాగంలో మహిళలకు, పురుషులకు, ప్రొఫెషనల్, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లోనూ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 8న ఉదయం 9 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో ఆధార్‌కార్డుతో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 89852 75068, 91779 48868 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేధింపులను షీటీం దృష్టికి తీసుకురావాలి

కరీంనగర్ క్రైం: అందరి ప్రవర్తన సమాజ ఉన్నతికి తోడ్పడాలని కరీంనగర్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత సైకాలజిస్టులతో ఆన్‌లైన్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మహిళలను వేధించే పద్ధతి మార్చుకోకపోతే కేసులు నమోదై, జీవితం అంధకారం అవుతుందని తెలిపారు. షీటీంలు కరీంనగర్ సిటీలో అందుబాటులో ఉన్నాయని మహిళలు, పిల్లలు ఎవరైనా వేధింపులను ఎదుర్కొంటుంటే నిర్భయంగా షీటీం దృష్టికి తీసుకురావాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది పర్శరాం, విజయమణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం
5-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	286	93
	65,226	19,436

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	13,154	△	95
డోజోన్స్	32,975	▽	27
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,412	▽	58
డాక్స్	15,100	△	15
షాంఘై (గురువారం ముగింపు)	3,110	△	3
నికాయ్	30,527	▽	711

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	56,653	▽	22
బంగారం (99.5 స్వచ్ఛత)	56,426	▽	22
వెండి (కిలో)	67,446	△	409

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.47	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	98.87	102.21
€	యూరో	ఎస్‌బీఐ	85.63	88.70
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.95	56.65
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.46	53.74
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.65	61.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.80	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.25

సూపర్‌డ్రైతో రిలయన్స్ జత

- 24:76 శాతం వాటాతో జేవీ ఏర్పాటు
- దక్షిణాసియా ఐపీ ఆస్తుల కొనుగోలు

న్యూఢిల్లీ: దక్షిణాసియా మేధో హక్కుల(ఐపీ ఆస్తులు) విక్రయానికి రిలయన్స్ రిటైల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు యూకే ఫ్యాషన్ రిటైలర్ సూపర్‌డ్రై తాజాగా పేర్కొంది. ఇందుకు భాగస్వామ్య సంస్థ(జేవీ) ద్వారా రిలయన్స్ రిటైల్ 4 కోట్ల పౌండ్లు(రూ. 402 కోట్లు) వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా స్వెట్‌షర్టులు, హుడీస్, జాకెట్స్ తదితర ఫ్యాషన్ ప్రొడక్టులను రూపొందిస్తున్న సూపర్‌డ్రై.. జేవీలో 24 శాతం వాటాను పొందనుంది. మిగిలిన 76 శాతం వాటా రిలయన్స్ రిటైల్ చేతిలో ఉంటుంది. ఒప్పందం ప్రకారం సూపర్‌డ్రై బ్రాండ్ ఐపీ ఆస్తులు కొత్తగా ఏర్పాటు చేయనున్న జేవీకి శాశ్వతంగా బదిలీకానున్నాయి. రిలయన్స్ బ్రాండ్స్ హోల్డింగ్ యూకేతో ఐపీ జేవీ ఏర్పాటుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సూపర్‌డ్రై పీఎల్‌సీ.. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి తెలియజేసింది. తద్వారా భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లలో సూపర్‌డ్రై బ్రాండుసహా.. సంబంధిత ట్రేడ్‌మార్క్‌లను జేవీకి బదిలీ చేయనున్నట్లు వెల్లడించింది.

నిధుల ఆవశ్యకత: సూపర్‌డ్రై ఇటీవల హోల్‌సేల్ కస్టమర్ల నుంచి బలహీన ఆర్డర్ల కారణంగా స్టాక్ నిల్వలు, లిక్విడిటీ తదితర అంశాలలో సవాళ్లు ఎదుర్కొంటోంది. దీంతో జేవీకి తెరతీసింది. దీంతో స్థూలంగా 3.04 కోట్ల పౌండ్ల నగదు లభించనుందని అంచనా వేస్తోంది. కాగా.. తాజా ఒప్పందంతో రిలయన్స్ దక్షిణాసియాలోని మూడు దేశాలలో కార్యకలాపాలు చేపట్టనున్నట్లు సూపర్‌డ్రై తెలియజేసింది. జేవీలో సూపర్‌డ్రై వాటాను కొనసాగించడంతోపాటు.. తమ నైపుణ్యం ద్వారా బ్రాండ్ డెవలప్‌మెంట్, డిజైన్, మార్కెటింగ్‌లలో మద్దతిస్తుందని రిలయన్స్ బ్రాండ్స్ ఎండీ దర్శన్ మెహతా చెప్పారు. భారత్ భారీ అవకాశాల మార్కెట్‌కాగా.. రిలయన్స్‌తో పటిష్ట బంధమున్నట్లు సూపర్‌డ్రై వ్యవస్థాపకుడు, సీఈవో జూలియన్ డంకెర్టన్ పేర్కొన్నారు.

2035 నాటికి ట్రిలియన్ డాలర్లు

- భారత వాహన రంగంపై అంచనా
- ఆర్థర్ డి లిటిల్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ రంగం 2035 నాటికి ఎగుమతి ఆధారిత ట్రిలియన్ డాలర్ పరిశ్రమగా ఎదిగే అవకాశం ఉందని ఆర్థర్ డి లిటిల్ నివేదిక పేర్కొంది. తయారీ, ఆవిష్కరణలు, సాంకేతికత తోడుగా పరిశ్రమ ఈ స్థాయికి చేరుకుంటుందని తెలిపింది. 'భారత వాహన పరిశ్రమ అంతర్జాతీయ మార్కెట్లకు డిజైన్, అభివృద్ధి, ఉత్పత్తికి ఆకర్షణీయ ప్రపంచ కేంద్రంగా మారవచ్చు. దీనిని సాధించడానికి ఈ రంగంలోని కంపెనీలు ప్రపంచ తయారీకి అనుగుణంగా తమ సామర్థ్యాలను విశ్వసనీయ, పోటీతత్వంగా మెరుగుపర్చుకోవాలి. జోనల్ ఆర్కిటెక్చర్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటి కొత్త సాంకేతికతలకు అనుగుణంగా పరిష్కారాలను అందించడం ద్వారా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ పరిశోధన, అభివృద్ధిలో భారత శక్తి సామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. నిధులతో కూడిన స్టార్టప్ పర్యావరణ వ్యవస్థతో భారతదేశం వాహన రంగంలో నాయకత్వ స్థానంలో ఉండగల సామర్థ్యాన్ని కలిగి ఉంది' అని వివరించింది.



నాయకత్వ స్థానంగా..: దేశీ వాహన రంగంలో పెరుగుతున్న ఆవిష్కరణల వేగాన్ని, మారుతున్న సాంకేతికతలను సమర్థవంతంగా ఉపయోగించినట్లయితే భారతదేశాన్ని ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో నాయకత్వ స్థానంగా మార్చవచ్చని నివేదిక తెలిపింది. 'ప్రపంచవ్యాప్తంగా ఆటోమోటివ్ పరిశోధన, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ మార్కెట్ 2030 నాటికి మూడు రెట్లు వృద్ధి చెంది 400 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. భారతదేశం ప్రపంచ సాఫ్ట్‌వేర్ హబ్‌గా, ఆఫ్‌షోర్ గమ్యస్థానంగా తన స్థానాన్ని ఉపయోగించుకోవచ్చు. భారత వాహన పరిశ్రమ నిజమైన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వంతో సహా ముడిపడి ఉన్న భాగస్వాముల మధ్య బలమైన చర్చలు, సమిష్టి చర్యలు అవసరం' అని నివేదిక వివరించింది.

నెల కనిష్టానికి సూచీలు

- కొనసాగిన ప్రపంచ ప్రతికూల సంకేతాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాల ప్రభావం

ముంబై: బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం కొనసాగడంతో స్టాక్ మార్కెట్ రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 286 పాయింట్లు పతనమై 65,226 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93 పాయింట్లు క్షీణించి 19,436 వద్ద నిలిచింది. రెండు సూచీలకు ముగింపు స్థాయిలు నెల కనిష్ఠం. ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ కమిటీ సమావేశం ప్రారంభం నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తత వహించారు. స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే కొనసాగాయి. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆటో షేర్లు పెద్ద ఎత్తున నష్టపోయాయి. ఒక దశలో సెన్సెక్స్ 633 పాయింట్లు నష్టపోయి 65 వేల స్థాయి దిగువన 64,879 వద్ద, నిఫ్టీ 195 పాయింట్లు పతనమై 19,334 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.4,424 కోట్ల షేర్లు అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,769 కోట్ల షేర్లను కొన్నారు.



- అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 3% పెరిగి రూ.2464 వద్ద స్థిరపడింది. అబుదాబీ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటర్నేషనల్ హోల్డింగ్(ఐహెచ్‌సీ) ఓపెన్ మార్కెట్ కొనుగోళ్ల ద్వారా అదానీలో తన వాటాను 4.98% నుంచి 5.04 శాతానికి పెంచుకోవడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.
- అప్‌డేటర్ సర్వీసెస్ లిమిటెడ్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.300)తో 0.03 స్వల్ప డిస్కౌంట్‌తో 299.90 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 6% క్షీణించి రూ.282 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చింది. చివరికి 5.38% నష్టంతో 284 వద్ద నిలిచింది.

షెల్ డీజిల్ లీటర్ 20 పెంపు

లీటర్ విక్రయ ధర రూ.130

న్యూఢిల్లీ: షెల్ ఇండియా తన అవుట్‌లెట్ల ద్వారా విక్రయించే డీజిల్ ధరను లీటర్‌పై రూ.20 పెంచుతున్నట్లు ప్రకటించింది. వారం లోపే రెండో విడత ధరలను పెంచింది. దేశంలో అధిక వాటా కలిగిన ప్రభుత్వరంగ సంస్థలు మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా అవే రేట్లను కొనసాగిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు విక్రయ ధరల్లో ఎలాంటి సవరణలు చేయకపోవడం గమనించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మే నెలలో 75 డాలర్లలోపు ఉంటే, ప్రస్తుతం 95 డాలర్లపైకి చేరుకోవడం తెలిసిందే. షెల్ ఇండియా గత వారం కూడా లీటర్ డీజిల్‌పై రూ.4 చొప్పున పెంచింది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 346 పెట్రోల్ స్టేషన్లు ఉన్నాయి. ముంబైలో లీటర్ డీజిల్‌ను రూ.130కు, చెన్నైలో రూ.129 చొప్పున విక్రయిస్తోంది. పెట్రోల్ లీటర్ ధర రూ.117–118గా ఉంది. అదే ప్రభుత్వ రంగ ఆయిల్ కంపెనీలు లీటర్ డీజిల్‌ను రూ.95, లీటర్ పెట్రోల్ ధరను రూ.107 స్థాయిలో విక్రయిస్తుండడం గమనార్హం. ప్రాంతాలను బట్టి ఈ రేట్లలో స్వల్ప మార్పులు ఉంటాయి.



వరల్డ్ కప్ మ్యాచ్‌లకు స్పాన్సర్ల క్యూ..

- 26 స్పాన్సర్లు, 500 పైగా అడ్వర్టైజర్లు
- లిస్టులో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా
- డిస్నీ స్టార్ వెల్లడి

న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభమవుతున్న ఐసీసీ వరల్డ్ కప్ 2023 మ్యాచ్‌లను స్పాన్సర్ చేసేందుకు కంపెనీలు భారీ ఎత్తున క్యూ కడుతున్నాయి. ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 26 స్పాన్సర్లు, 500 ప్రకటనకర్తలు నమోదు చేసుకున్నట్లు టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో మ్యాచ్‌ల ప్రసార హక్కులను దక్కించుకున్న డిస్నీ స్టార్ స్పోర్ట్స్ విభాగం హెడ్ సంజోగ్ గుప్తా తెలిపారు. వీటిలో చాలా స్పాన్సర్లు టీవీ, డిజిటల్ ఫార్మాట్లను ఎంచుకోగా, కొన్ని కంపెనీలు కేవలం డిజిటల్ లేదా టీవీని మాత్రమే ఎంచుకున్నట్లు ఆయన వివరించారు. ఐసీసీ మెన్స్ క్రికెట్ వరల్డ్ కప్‌లో భాగంగా నిర్వహించే 48 మ్యాచ్‌లను డిస్నీ స్టార్ తమ టీవీ చానళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫాం డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం చేయనుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లు తొమ్మిది భాషల్లో 100 పైచిలుకు కామెంటేటర్స్‌తో డిస్నీప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం కానున్నాయి. వీటిలో తెలుగు, తమిళం తదితర భాషలు కూడా ఉన్నాయి. పన్నెండేళ్ల తర్వాత వరల్డ్ కప్ మ్యాచ్‌లకు భారత్ ఆతిథ్యమిస్తోంది.



భారత్‌పై అంచనాలు.. పండుగ సీజన్ దన్ను

ఆసియా కప్‌లో భారత మెరుగైన పనితీరు, పండుగ సీజన్, భారత్ టీమ్‌పై భారీ అంచనాలు తదితర సానుకూలాంశాల కారణంగా అడ్వర్టైజర్లు భారీగా ఆసక్తి చూపుతున్నట్లు గుప్తా చెప్పారు. అన్ని కేటగిరీల కంపెనీలూ స్పాన్సర్ చేసేందుకు లేదా ప్రకటనలు ఇచ్చేందుకు ఆసక్తిగా ఉన్నాయన్నారు. సాధారణంగా పండుగ సీజన్‌లో కంపెనీలు ప్రకటనలపై భారీగా వెచ్చిస్తుంటాయని తెలిపారు. స్పాన్సర్ల జాబితాలో కోకాకోలా, ఫోన్‌పే, మహీంద్రా అండ్ మహీంద్రా, డ్రీమ్11, హెచ్‌యూఎల్, హావెల్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, పెర్నాడ్ ఇండియా, బుకింగ్ డాట్‌కామ్, పీటర్ ఇంగ్లాండ్, కింగ్‌ఫిషర్ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్, మాండెలీజ్, ఎమిరేట్స్, డయాజియో, ఎంఆర్‌ఎఫ్, లెండింగ్‌కార్ట్, బీపీసీఎల్, హెర్బాలైఫ్, హయర్, యాంఫీ, గూగుల్ పే, పాలీక్యాబ్, అమూల్, విడా, అమెజాన్ మొదలైన సంస్థలు న్నాయి. కోకా–కోలా, ఫోన్‌పే, హెచ్‌యూఎల్ వంటి పలు కంపెనీలు ఇటు టీవీ, అటు డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ స్పాన్సర్ చేస్తున్నాయి.

అనువైన ప్యాకేజీలు..

ప్రకటనకర్తల బడ్జెట్, అవసరాలను బట్టి వారికి అనువైన ప్యాకేజీలను రూపొందించినట్లు గుప్తా చెప్పారు. 'పండుగ సీజన్ సందర్భంగా.. ఎవరైనా అడ్వర్టైజరు దీపావళి సమయంలో ఎక్కువ మంది కస్టమర్లు తమ ఉత్పత్తులపై మక్కువ చూపుతారనే ఉద్దేశంతో పండుగకి ముందు ఓ రెండు వారాలపాటు ప్రకటనలు ఇవ్వదల్చుకున్నారనుకుందాం. కాస్త ప్రీమియం చెల్లించి ఆ వ్యవధిలో మాత్రమే తమ ప్రకటనలను ప్రసారం చేసుకునేందుకు వీలు కల్పించేలా వారికోసం కస్టమైజ్డ్ ప్యాకేజీని అందిస్తున్నాం' అని తెలిపారు. వరల్డ్ కప్‌లో మరింత మంది ప్రకటనకర్తలు భాగమయ్యేందుకు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ''సెల్ఫ్–సర్వ్ ఫ్రేమ్‌వర్క్'ను ప్రవేశపెట్టినట్లు గుప్తా తెలిపారు. ఏజెన్సీలు, అడ్వర్టైజర్లు సేల్స్ టీమ్స్ జోక్యం లేకుండా, తమకు అవసరమైన వాటిని స్వయంగా బుక్ చేసుకునే వీలుంటుందని వివరించారు.

ఇంటి వద్దకే ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు

మొబైల్ డివైజ్‌లతో సర్వీసుల ఆవిష్కరణ

ముంబై: అందరినీ ఆర్థిక సేవల పరిధిలోకి చేర్చే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మరిన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఎక్కడికైనా తీసుకెళ్లగలిగే, చేతిలో ఇమిడిపోయే మొబైల్ హ్యాండ్‌హెల్డ్ పరికరాల ద్వారా కూడా సేవలు అందించే విధానాన్ని ఆవిష్కరించింది. నేరుగా ఖాతాదారుల ఇంటి ముంగిట్లోకే కియోస్క్ బ్యాంకింగ్ సర్వీసులను తీసుకెళ్లేందుకు ఈ విధానం ఉపయోగపడగలదని బ్యాంక్ చైర్మన్ దినేశ్ ఖారా తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఖాతాదారులు మొదలైన వారికి ఇంటి దగ్గరే బ్యాంకింగ్ సర్వీసులు అందించడంలో కస్టమర్ సర్వీస్ పాయింట్ ఏజెంట్లకు వీటితో వెసులుబాటు లభిస్తుందన్నారు. నగదు విత్‌డ్రాయల్, డిపాజిట్లు, ఫండ్ ట్రాన్స్‌ఫర్లు, బ్యాలెన్స్ ఎంక్వైరీ, మినీ స్టేట్‌మెంట్స్ వంటి అయిదు రకాల సర్వీసులు ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు అకౌంటు తెరవడం వంటి ఇతర సేవలను కూడా చేర్చే యోచనలో ఎస్‌బీఐ ఉంది.



విద్య, ఉద్యోగ సమాచారం

నవోదయ విద్యాలయాల్లో 11వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో పదకొండో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023–24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» **వయసు:** 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» **ప్రవేశ పరీక్ష:** జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్)ఉంటాయి. మొత్తం 100ప్రశ్నలు –100 మార్కులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2023
» **ప్రవేశ పరీక్ష తేది:** 10.02.2024.
» **వెబ్‌సైట్:** navodaya.gov.in

ఐవోసీఎల్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఐవోసీఎల్ రీజియన్‌లలో గేట్–2024 ద్వారా గ్రాడ్యుయేట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్–2024 అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** గేట్ 2024 స్కోరు, ఇంటర్వ్యూ, వైద్య పరీక్ష, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** గేట్ 2024 ఫలితాలు వెల్లడి తర్వాత ఐవోసీఎల్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** www.iocl.com

ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 68 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఫిజిసిస్ట్–02, క్లినికల్ సైకాలజిస్ట్–01, మెడికల్ ఆఫీసర్(ఆయుష్)–01, యోగా ఇన్‌స్ట్రక్టర్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్–04, స్టోర్ కీపర్–04, జూనియర్ ఇంజనీర్–03, జూనియర్ ఫిజియోథెరపిస్ట్–01, జూనియర్ ఆడియాలజిస్ట్/స్పీచ్ థెరపిస్ట్–02, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, ఆప్టోమెట్రిస్ట్–02, టెక్నీషియన్(ల్యాబొరేటరీ)–16, టెక్నీషియన్(రేడియాలజీ)–02, ఫార్మసిస్ట్–05, ఫైర్ టెక్నీషియన్–02, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్‌లు–02, స్టెనోగ్రాఫర్–04, లాండ్రీ సూపర్‌వైజర్–01, జూనియర్ వార్డెన్–02, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్–10.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో 10+2/డిగ్రీ/ఎంబీఏ /ఎంఎస్సీ/పీజీ డిగ్రీ/ఎంఏ/పీజీ డిప్లొమా/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ టెస్ట్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఉద్యోగ ప్రకటన వెలువడిన 30 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

కాళోజీ వర్సిటీలో ఎంపీటీ ప్రవేశాలు

వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీటీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు.
» **అర్హత:** బీపీటీ డిగ్రీ లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 30.09.2023లోపు ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.10.2023
» **వెబ్‌సైట్:** www.knruhs.telangana.gov.in

బోధన, పరిశోధనకు.. నెట్

బోధన, పరిశోధన రంగాల్లో ప్రవేశానికి మార్గం.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్! సంక్షిప్తంగా.. యూజీసీ నెట్! ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. రీసెర్చ్‌కు అవకాశం కల్పించే జేఆర్‌ఎఫ్ పొందొచ్చు. మరో వైపు బోధన రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులూ దక్కించుకోవచ్చు. యూజీసీ-నెట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా యూజీసీ నెట్-డిసెంబర్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. యూజీసీ-నెట్‌తో ప్రయోజనాలు, అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

» యూజీసీ నెట్ డిసెంబర్ 2023 నోటిఫికేషన్ విడుదల
» డిసెంబర్ 6 నుంచి 22 వరకు పలు స్లాట్లలో పరీక్షలు
» నెట్‌లో ఉత్తీర్ణతతో జేఆర్‌ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు అర్హత
» 80కు పైగా సబ్జెక్ట్‌లలో నెట్ నిర్వహణ



యూజీసీ-నెట్ 2023

సైన్స్, టెక్నాలజీ తదితర విభాగాల్లో పరిశోధనలకు మార్గాలు అనేకం. కానీ హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో మాత్రం ఆశించిన మేరకు రీసెర్చ్ అవకాశాలు లేవు. ఈ సమస్యకు పరిష్కారంగా అందుబాటులోకి తెచ్చిన విధానమే.. యూజీసీ–నెట్. దీనిద్వారా సైన్స్, ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధన అవకాశాలు అందుకోవచ్చు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో అధ్యాపక వృత్తిలో ప్రవేశించాలనుకునే వారికి యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

83 సబ్జెక్టుల్లో నెట్

యూజీసీ నెట్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రతి ఏటా రెండుసార్లు నిర్వహిస్తోంది. తాజాగా 2023 డిసెంబర్ సెషన్‌కు సంబంధించి ప్రకటన ఇచ్చింది. 83 సబ్జెక్ట్‌లలో డిసెంబర్ 6 నుంచి 22 వరకు పరీక్షలను నిర్వహించనుంది. దీని ద్వారా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

రెండు కేటగిరీలుగా

- యూజీసీ–నెట్‌ను సాధారణంగా రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అవి.. అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తాము ఏ కేటగిరీ పరీక్షకు హాజరు కావాలనుకుంటున్నారో స్పష్టం చేయాలి.
- రీసెర్చ్/జేఆర్‌ఎఫ్ పట్ల ఆసక్తి ఉన్న వారు.. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకోవాలి.
- అధ్యాపక వృత్తికి మాత్రమే పరిమితమవ్వాలనుకునే వారు అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రాథమ్యాన్ని ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.

పేపర్ ఎంపిక ఎలా

- అసిస్టెంట్ ప్రొఫెసర్, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అభ్యర్థులందరూ..పేపర్–1కు తప్పనిసరిగా హాజరు కావాలి.
- అభ్యర్థులు తమ పీజీ స్పెషలైజేషన్ ఆధారంగా ఎంపిక చేసుకున్న సబ్జెక్టుపై నిర్వహించే పరీక్ష పేపర్ 2. ఉదాహరణకు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ స్పెషలైజేషన్ చదివిన అభ్యర్థులు ఎకనామిక్స్ సబ్జెక్ట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు ఎంపిక చేసుకున్న ప్రాథమ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రశ్నలు అడుగుతారు.

రెండు పేపర్లలో పరీక్ష

- యూజీసీ నెట్‌ను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పేపర్–1.. 50 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇందులో టీచింగ్/రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, భిన్నమైన ఆలోచన సరళిపై ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2.. 100 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇది అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ పేపర్. ఇందులో అభ్యర్థుల డొమైన్ నాలెడ్జ్ పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. రెండు పేపర్లకు కలిపి మొత్తం మూడు గంటల వ్యవధిలో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. నెగెటివ్ మార్కింగ్ నిబంధన లేదు.

కనీస అర్హత మార్కులు

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కనీస అర్హత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు రెండు పేపర్లలో కలిపి 40 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం మార్కులు సాధించాలి. ఈ సడలింపు (35 శాతం మార్కులు)ను జనరల్–ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కూడా ఉంటుందని పేర్కొన్నారు.

ఆరు శాతం మంది మాత్రమే

మొత్తం హాజరైన అభ్యర్థుల్లో ఆరు శాతం మందినే నెట్ ఉత్తీర్ణులుగా (అసిస్టెంట్ ప్రొఫెసర్) ప్రకటిస్తారు. అదేవిధంగా జేఆర్‌ఎఫ్ అండ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీ అభ్యర్థుల ఎంపికలోనూ కనీస అర్హత మార్కుల ఆధారంగా ఉత్తీర్ణులను ప్రకటించనున్నారు. ఇందుకోసం పలు స్లాట్లలో నిర్వహించనున్న పరీక్షను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా నార్మలైజేషన్ ప్రక్రియ చేపడతారు.

నెట్‌తో ప్రయోజనాలు

- అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాతో అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టొచ్చు. యూజీసీ నిబంధనల ప్రకారం–నెట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ కేటగిరీలో ఉత్తీర్ణత సాధించిన వారినే ఈ పోస్టులకు ఎంపిక చేయాలి. ఏడో పీఆర్‌సీ సిఫార్సుల ప్రకారం–అసిస్టెంట్ ప్రొఫెసర్ పే స్కేల్‌ను ప్రారంభంలోనే నెలకు రూ.67 వేలు బేసిక్ పే చెల్లించాలని యూజీసీ నిర్దేశించింది.
- జేఆర్‌ఎఫ్‌కు ఎంపికైతే.. ప్రముఖ రీసెర్చ్ లేబొరేటరీల్లో రెండేళ్లపాటు జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత మరో రెండేళ్ల సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది.
- జేఆర్‌ఎఫ్ హోదాలో మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేల ఫెలోషిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్ విజయవంతంగా పూర్తి చేసిన వారికి ఎస్‌ఆర్‌ఎఫ్‌కు అర్హత లభిస్తుంది. ఈ దశలో రెండేళ్లపాటు నెలకు రూ.35 వేల స్కాలర్‌షిప్ అందుతుంది.
- జేఆర్‌ఎఫ్, ఎస్‌ఆర్‌ఎఫ్‌లు పూర్తి చేసుకున్న వారు సైంటిస్ట్‌లుగా కెరీర్ ప్రారంభించొచ్చు.
- ఐఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీ, రీసెర్చ్ అభ్యర్థుల ఎంపికలో నెట్ ఉత్తీర్ణులకు ప్రాధాన్యం ఉంటుంది.
- ఆర్ట్స్,హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ సబ్జెక్ట్‌లలో జేఆర్‌ఎఫ్‌కు ఎంపికై పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి పురావస్తు శాఖ, ఆర్థిక గణాంక శాఖలు, సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ వంటి పలు ప్రభుత్వ శాఖల్లో రీసెర్చ్ స్కాలర్స్‌గా అవకాశాలు లభిస్తాయి.

సబ్జెక్ట్‌పై పట్టుతోనే సక్సెస్

ఆరు శాతం మందిని మాత్రమే తుది జాబితాకు ఎంపిక చేసే యూజీసీ నెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు పరిశోధనల పట్ల తమకున్న ఆసక్తి మొదలు, సబ్జెక్ట్ పరంగా సంపూర్ణ అవగాహన పెంచుకునేందుకు కృషి చేయాలి.

పేపర్-1కు ఉమ్మడిగా

రెండు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడిగా నిర్వహించే పేపర్–1లో అభ్యర్థుల టీచింగ్, రీసెర్చ్ ఆసక్తులను పరిశీలించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. మొత్తం పది విభాగాలు (టీచింగ్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్, కమ్యూనికేషన్, రీజనింగ్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, పీపుల్ అండ్ ఎన్విరాన్‌మెంట్, హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్–గవర్నెన్స్, పాలిటీ అండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి ఒక్కో విభాగంలో అయిదు ప్రశ్నలు అడుగుతారు.

పేపర్-2 సబ్జెక్ట్ పేపర్

పేపర్–2లో ప్రశ్నలు పీజీ స్పెషలైజేషన్ సిలబస్ స్థాయిలో ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి ఇంటర్మీడియెట్ నుంచి పీజీ వరకు.. అన్ని అంశాలపై పట్టు సాధించాలి.

అన్వయ దృక్పథం

ఆయా అంశాలను చదివేటప్పుడే అప్లికేషన్ ఓరియెంటేషన్, ప్రాక్టికల్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఎందుకంటే.. పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అప్లికేషన్ ఓరియెంటేషన్ కీలకంగా మారుతోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులకు చివరి తేది: 28.10.2023
- దరఖాస్తు సవరణ తేదీలు:30, 31 అక్టోబర్ 2023
- పరీక్ష తేదీలు: 06.12.2023 నుంచి 22.12.2023 వరకు
- వెబ్‌సైట్: https://ugcnet.nta.ac.in